
# మానవ వనంలోకి....

స్వరూప్ సిన్హా



"తాతయ్యా వాళ్ళది వట్టి పల్లెటూరు కదు మమ్మీ...! నాకక్కడ చెడ్డబోర్...రెండ్రోజుల కంటే ఎక్కువ ఉండలేను. త్వరగా వచ్చేస్తాను" వెళ్తూ వెళ్తూ సుమంత్ అన్న మాటలు ఇంకా చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి సావిత్రికి.

అలా వెళ్ళిన వాడు పది రోజులు దాటినా ఇంటి ముఖం చూడలేదు. కొంపదీసి బిడ్డ కాయిలా పడ్డాడో ఏమిటో! మనసు పరిపరివిధాల పోయింది సావిత్రికి.

అంతలో గుమ్మం ముందు స్కూటరాగిన చప్పుడయింది. గోపాలం హడావుడిగా లోనికొచ్చాడు. "త్వరగా తయారవ్వు. మనం మధ్యాహ్నం బస్సుకు మా ఊరెళ్ళాలి. కంగారేమీ లేదు. సుమంత్ బాగున్నాడట. నాన్న మనల్ని ఓసారి చూడాలని ఉంది. వచ్చి వెళ్ళమన్నారు."

బెడ్‌రూంలోకి వెళ్లి సూట్‌కేస్ గబగబా సర్దసాగేడు గోపాలం. కోటి ప్రశ్నలు మనసులో మెదులుతుండగా నిస్త్రాణగా లోపలికి నడిచింది సావిత్రి.

తల్లిదండ్రులు అల్లంత దూరంలో ఉండగానే పరుగు పరుగున వచ్చి చుట్టుకుపోయాడు సుమంత్. సావిత్రి కొడుకును అక్కున చేర్చుకుంది. తల నిమురుతూ ముఖంలోకి పరిశీలనగా చూసింది.

"ఇంత చిక్కిపోయావేంరా కన్నా...! ఒంట్లో బాగా లేదా?"

"అదేం లేదు మమ్మీ...నాకిక్కడ చాలా బాగుంది" సంతోషంగా చెప్పాడు.

"మరిన్నాళ్ళుండి పోయావేం? కాలేజీ తెరిచి పది రోజులు కావస్తోంది. మీ ప్రిన్సిపాల్‌గారు రోజా ఇంటికి మనుష్నల్ని పంపిస్తున్నారు" కాస్త గట్టిగా అడిగాడు గోపాలం. ఆ మాటలకు సుమంత్ ముఖం మాడిపోయింది. తలదించు కున్నాడు. అంతలో గోపాలం తండ్రి రఘురామయ్యగారు కలగచేసుకుని అడిగారు.

"సుమంత్‌కోసం కాలేజీ వాళ్ళు వాకబుకొస్తున్నారనా? లేక రేపు నీ కొడుకు డాక్టరెలా అవుతాడనా?' ఇంతకీ ఏమిట్రా నీ బెంగ?"

"రెండూనూ...అయినా వీడిలా కాలేజీ మానేసి ఇక్కడ ఇన్నాళ్ళుండిపోతే...కనీసం నువ్వయినా చెప్పి పంపలేకపోయావా నాన్నా...ఈ పది రోజుల్లో వాడెన్ని పాఠాలు మిస్ అయ్యాడో మీకేమయినా తెలుసా?"

"పంపనురా...నా మనవణ్ణి ససేమిరా పంపను"దృఢంగా అన్నారాయన.


"వీడిలా గైర్హాజరైతే రేపు డాక్టరెలా

అవుతావు?" తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి అన్నారు.

ఆదన్నమాట సంగతి. మీరు వీణ్ణి నమ్మంటున్నది కాస్తయినా రీప్రేమతో కాదన్నమాటేగా!"

"అదేమిటి నాన్నా...మీరు మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు."

"కాదురా, సరిగ్గానే అర్థం చేసుకున్నాను. మీరు ప్రేమతో పిలిస్తే వాడెప్పుడో మీ ఊరికి రెక్కలు కట్టుకొని



వచ్చేవాడు. హాయిగా ఆడుతూ పాడుతూ పెర గాల్సిన వయసు వాడిది. కానీ మీరు వాడి బ్రతుకొక బందిఖానా చేశారు. రోజూ పెట్టే పరీక్షలకు భయపడుతూ, మాస్టార్లకూ, మీకూ బానిసలా బ్రతుకుతూ చివరికి తిండీనిద్రా సరిగ్గా కుదరక వాడేదో మానసిక రుగ్మతకు లోనయ్యే ప్రమాదాన్ని మీరే కొని తెచ్చుకున్నారు..."

"ఏమిటి నాన్నా మీరంటు న్నది. సుమంత్ చదువులో ఫస్టేనే! వాడికి చదువు ఇష్టం లేదని ఎవరు చెప్పారు?"

"నా మాట మీద నమ్మకం లేకుంటే వాడినే అడగండి విషయ మేమిటో" కోపంగా అన్నాడాయన. అంతలో సుమంత్ "నేను రాను మమ్మీ. నాకిక్కడే బాగుంది. ఉదయాన్నే తాతయ్య పాడే కీర్తనలూ, నాన్నమ్మచేసే పూజా, ఇక్కడ స్నేహితులతో గోదారి ఒడ్డున స్నానాలు, ఆటలూ, కోవెల గంటల సవ్వడితో తెల్లారి, పక్షుల కిలకిలల్తో వాలే పొద్దూ నాకివే బాగున్నాయి. నాకిక్కడే ప్రశాంతంగా వుంది" అన్నాడు.

గోపాలం కోపం నసాళానికంటింది. "నువ్వు చెప్పినవి మనూర్లో లేకపోవచ్చు. కానీ నీకు చదవాలన్న ధ్యాస తగ్గినట్లుంది. అందుకే నీ ఆలోచనా ధోరణి పెడదారి పడుతోంది."

"నాకు మనూర్లో బోర్ డాడీ! పొద్దున్నే మూడింటికి పరీక్షలకు చదవాలి. నాలుగింటికి ట్యూషన్‌లకు పరుగు పెట్టాలి. కాలేజీ అయ్యాక మళ్ళీ ట్యూషన్లు. సాయంత్రం నుంచీ ఇంట్లో చదువు. ఆదివారాలూ, సెలవు దినాలూ కూడా క్లాసులూ, టెస్ట్‌లూ...రోజూ నేనొక యంత్రంలా ఈ పనులన్నీ చేస్తున్నాను. ఇలాగే ఇంకొన్నాళ్ళుంటే నేను చచ్చిపోతాను. నాకా చదువొద్దు. ర్యాంకులు తెచ్చుకోవడానికి ఆ పరుగులొద్దు. నాకక్కడ రోజూ భయం...భయం తప్ప మరే ధ్యాసలేదు. మార్కులు తక్కువొస్తే ఏమని తిడతారో, ఏ బెల్టుతో కొడతారో, ఏ కొరడాతో వాతలు పెడతారోనని భయం...నేను చచ్చిపోతాను డాడీ...నేను రాను."

వెక్కి వెక్కి ఏడ్చాడు సుమంత్. అవాక్కయిపోయారు సుమంత్ తల్లిదండ్రులు.

"అదిరా గోపీ! అందుకే పిల్లాణ్ణి నేను పంపలేదు. ఆ నిర్బంధ సైనిక శిక్షణలాటి చదువుతో వాడికి పిచ్చెక్కే ప్రమాదముంది" అన్నారు రఘురామయ్యగారు.

"మరి చదవకపోతే ఎలా నాన్నా? రేపు వాడి భవిష్యత్తేమిటి?"

సావిత్రీ, గోపాలానికి జరుగుతున్నది చూస్తుంటే తమకీ పిచ్చెక్కే ప్రమాదముంది అనిపించింది.

"అదేరా గోపీ...నేను నిన్ను అడగాలనుకున్న ప్రశ్న. చదువంటే ఈ డాక్టరీ, ఇంజనీరింగు తప్ప మరేం కావా? ఇలా వాణ్ణి రాత్రింబవళ్ళు చదువు పేరుతో హింసించకుంటే?"

"ఇవన్నీ ఈ సంఘంలో 'ప్రిస్టేజి' సమస్య నాన్నా. ఇలా చదివించకుంటే మా కొలీగ్స్‌లో ఎంత తలవంపులు. రేపు పొరుగు రాష్ట్రంలోనైనా డొనేషన్ కట్టి సీటు సంపాదించలేకపోతే ఎంత చిన్నతనం?"

"అక్కడేరా, నువ్వు పొరబడుతున్నావు. బిడ్డ అభిరుచి ఏమిటో కనుక్కోకుండా నువ్వే వాడి భవిష్యత్తును నిర్దేశించాలనుకుంటున్నావు. పసిప్రాణం...ఎంత అలసిపోయిందో, చదువంటే ఎంత వేసారిపోయిందో మీరిద్దరూ ఒక్కసారైనా ఆలోచించారా?"

"ఇంతకూ వాడిక్కావలసిందేమిటి నాన్నా? చదువు మానేసి ఇంట్లో తిని కూచోవడమేనా?" విసుగ్గా అడిగాడు గోపాలం.

"అదికాదు డాడీ,నేనిక్కడే తాతయ్య వాళ్ళ ఊరి కాలేజీలో చేరతాను"నసిగాడు సుమంత్.

"ఇక్కడా?" ఏదో వినగూడని విషయం చెవిని పడ్డట్టు చూశారు వాళ్ళు.

"అవును నేనూ తాతయ్యలాగే టీచరునవుతాను. సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టం నాకు. పెద్దయ్యాక గొప్ప కళాకారుణ్ణవుతాను."

ఏ దెయ్యాన్నో, భూతాన్నో చూసినట్లు చూశారు వాళ్ళు సుమంత్‌ను.

హాయిగా నవ్వారు రఘురామయ్యగారు.

"అదిరా విషయం. వాడు చదివే చదువుకు నాలా బడిపంతులుద్యోగం రాకపోదు. వాడికిష్టం లేప్పుడు నిర్బంధమెందుకు? హాయిగా ఆడుతూ పాడుతూ చదువుకోనివ్వండి."

"చాల్లే నాన్నా. ఇదంతా నీ పన్నాగమన్నమాట. వాడికి కల్లబొల్లి కబుర్లు చెప్పి బడిపంతుల్ని చేస్తావన్న మాట చివరికి..."దురుసుగా అడిగాడు గోపాలం.

"అదేమిటి బాబూ, ఇందులో మీ నాన్నగారి ప్రమేయం లేదు. సుమంతే తనకు డాక్టర్నవ్వడం ఇష్టం లేదన్నాడు. వాడు వాళ్ళ తాతయ్యను ఆదర్శంగా తీసుకున్నాడు" గోపాలం తల్లి వసుంధరమ్మగారు కలగజేసుకుని చెప్పారు..

"మరేనండీ...బలవంతంగా తమరి అభిప్రాయాల్ని వాడినెత్తిన రుద్దితే ఆదర్శంగా తీసుకోక ఏం చేస్తాడు...?" వెటకారంగా అంది సావిత్రి.

"మమ్మీ...ఇందులో తాతయ్య నానమ్మల తప్పేం లేదు. అయినా డాడీ మీరున్నది టీచింగ్ ప్రొఫెషన్‌లోనే కదా! మరి మీ వృత్తిమీద మీకే గౌరవం లేదా? మీ ప్రొఫెషన్‌ను ఇంత తక్కువ చేసి చిన్న చూపు చూస్తారెందుకు? ఓ డాక్టరయినా, ఇంజనీరయినా చివరికి దేశప్రధాని అయినా ఓ మాస్టారి దగ్గర చదువు నేర్చుకొని



ఇటీవల హైదరాబాద్‌లో 'జయంతి కళా సమితి ఆధ్వర్యంలో రచయిత, కార్టూనిస్ట్ చలపాక ప్రకాష్‌కు 2002 జయంతి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఆం.ప్ర. సాంస్కృతిక మండలి అధ్యక్షులు డా॥సి.నారాయణరెడ్డి, హాస్య బ్రహ్మ శ్రీ శంకరనారాయణ, కథా రచయితలు శ్రీ కె.ఆర్.కె. మోహన్, శ్రీ వేదగిరి రాంబాబు, ఎస్వీ కృష్ణ జయంతి గార్లని చిత్రంలో చూడవచ్చు.



ఢిల్లీ ఫిక్కీ ఆడిటోరియంలో ఢిల్లీ తెలుగు సంఘం వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ కార్టూనిస్టు శ్రీ బి.వి. సత్యమూర్తిని మొమెంటోతో సన్మానిస్తున్న ఆం.ప్ర. శాసనసభ స్పీకరు శ్రీమతి ప్రతిభా భారతి

పైకొచ్చినవారే కదా! మరి నేనూ టీచర్ని అవుతానంటే అలా చులకనగా చూస్తారేం?"

"అది కాదురా సుమంతా, పాపం మీ నాన్న నిన్ను డాక్టర్ని చేసి ఎన్ని లక్షలు కట్నంగా గుంజాలనీ ప్లానుమీదున్నాడో...నువ్వలా మాట్లాడితే ఎలా?"తాతా మనవళ్ళిద్దరూ ఒక్కసారిగా నవ్వేశారు. సావిత్రి గోపాలం తల దించుకున్నారు.

వాతావరణం వేడెక్కేటట్టుందని వసుంధరమ్మగారే అన్నారు- "మీరేం బెంగ పెట్టుకోకండర్రా! ఒక్కగానొక్క పిల్లవాడు. వాడి ముచ్చటనెందుక్కాదనాలి. మీ నాన్న బడిపంతులయినా మనూర్లో ఎంత గౌరవాన్ని పొందలేదూ! ఇక్కడ ఎవరింట్లో ఏ శుభకార్యమయినా మీ నాన్నను సంప్రదించందే ఎవరూ ఏదీ చెయ్యరు. గౌరవప్రతిష్ఠలు పొందడానికి మంచి మానవత్వమున్న మనిషయితే చాలు...డాక్టరో,ఇంజనీరో కానక్కరలేదు."

"బాబూ గోపీ! సుమంత్‌ను ఇబ్బంది పెట్టకు. వాడిష్టం వచ్చిన చదువే వాణ్ణి చదువుకోనీ. వాడికెలాగూ కళల పట్ల ఆసక్తి వుంది. ఆ ఆసక్తికి నేను మెరుగు పెడతాను. దేవుడి దయ ఉంటే వాడొక గొప్ప కళాకారుడే కావచ్చు. మనూరి ప్రశాంత వాతావరణం వాడికి నచ్చింది. ఈ మానవవనంలో వాణ్ణి కొన్నేళ్ల పాటయినా సేదదీరనీ. మనిషిగా మసలనీ, ఒక యంత్రంలా కాదు.మనసుతో ఆలోచించనీ, నీ డబ్బుతో, ప్రిస్టేజ్‌తో, నవ్వు కట్టే డొనేషన్లతో కాదు" గంభీరంగా ధ్వనించిందాయన కంఠం.

ఆలోచనలో పడ్డారు సుమంత్ తల్లిదండ్రులు. "మనసు స్వాధీనమైన ఘనునికి-మరి మంత్ర తంత్రములేలా...?"

లోపలి గదిలో సుమంత్ తాతగారి గ్రామఫోనుపై రికార్డు పెట్టుకుని ఆ శంకరాభరణ రాగంలో సంతోషంగా లీనమై వింటూ కూర్చున్నాడు... ❋



## మహిమ

'సుబ్బు'తో సినీరంగ ప్రవేశం చేసిన బెంగాలీ భామ సోనాలీ జోషి తొలిచిత్రం. దర్శకుడు లైంగిక వేధింపులకు గురిచేశాడంటూ స్టేట్‌మెంట్స్ ఇచ్చి పాపులారిటీని సంపాదించు కుంది. దీనితో సోనాలి జోషి అంటే దర్శకులకు భయం పట్టుకుంది. ఈ కారణంగానే ఆమెకు ఇప్పుడు సినిమా ఛాన్స్‌లు లభించడం కరువై పోయింది. సినిమా ఫీల్డ్‌లోని నగ్నసత్యాలను ఇప్పుడిప్పుడే వంట పట్టించుకుంటున్న ఈ ముద్దుగుమ్మ నిర్మాత, దర్శకులతో ఫ్రీగానే మూవ్ అవుతోందట. అవసరం మనిషిచే ఎంతటి పనైనా చేయిస్తుంది అనే విషయం అక్షరాలా నిజం అని సోనాలి జోషి నిరూపించింది.